భయంభయంగా రైతులు





ఒకవైపు మబ్బులు కాస్తుండగా కళ్లాల్లో ధాన్యం బస్తాలకు ఎత్తుతున్న రైతులు, (ఇన్‌సెట్లో) లారీలకు లోడు చేస్తున్న ధాన్యం

సాలూరు రూరల్:

ఆరుగాకాలం పండించిన పంట ఇంటికి చేరుతుందో లేదో? గిట్టుబాటు ధర లభిస్తుందో లేదోనన్న భయాందోళనల మధ్య రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఈ పరిస్థితులకు కారణంగా ఈ ఏడాది ప్రభుత్వం రైతుపై చూపిన నిర్లక్ష్యంతో పాటు వాతావరణ పరిస్థితులు పగ బట్టినట్లు కనిపిస్తున్నాయి. సాలూరు మండలంలో పత్తి పంట రైతులకు వాతావరణ పరిస్థితులు అంతగా అనుకూలించకపోవడంతో తొలి దశలోనే పంట దిగుబడి తగ్గడంతో పాటు కొనుగోలు కేంద్రంలో రైతుకు అనుకూల పరిస్థితులు ప్రభుత్వం కల్పించకపోవడం వెరశి ,క్వింటా దగ్గర రూ.1000 వరకు నష్టపోయి మరీ దళారులకు అమ్మకాలు జరిపారు. ఏదో కొంత వరి రైతుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో కొంతపంట దిగుబడి వచ్చిందన్న ఆనందాన్ని తుఫాన్ రూపంలో వాతావరణం రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇటీవల ఫెంగల్ తుఫాన్ బారిన పడిన రైతులు కోసిన వరిచేలు పొలాల్లో తడిసి ముద్దయ్యాయి. ఆ పరిస్థితి నుంచి కోలుకుని మళ్లీ కోతలు ప్రారంభించి ముమ్మరంగా నూర్పులు చేస్తున్న తరుణంలో మరో తుఫాన్ హెచ్చరికలు జారీ కావడంతో రైతు బిక్కుబిక్కుమంటూ కళ్లాల్లో నూర్చిన ధాన్యాన్ని ఒకవైపు కప్పుతూ మరోవైపు బస్తాలకు ఎత్తుతూ రైతులు నరకయాతన పడుతున్నారు. ఇప్పటికే చాలావరకు వరిచేలు నూర్పులు పూర్తిచేసిన సాలూరు మండలం రైతులు దళారులకే అమ్మకాలు జరిపారు. ఈ విషయంలో ప్రభుత్వం కనీసం దళారులను నియంత్రించే ప్రయత్నం చేయలేదు సరికదా కొనుగోలు కేంద్రం సిబ్బంది కూడా దళారులకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారన్న ప్రచారం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మరికొంతమంది రైతులు కోసిన పంట ఇప్పటికీ పొలాల్లోనే ఉండిపోవడంతో బుధవారం కూలీలసాయంతో కొంతమంది కుప్పలు వేసుకోగా కూలీలు దొరకక మరికొంతమంది వరిచేలు పొలాల్లోనే ఉండిపోయాయి.

వాతావరణ పరిస్థితులతో భయం



ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో భయమేస్తోంది. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియక ఆందోళన చెందుతున్నాను. సీడ్ ధాన్యం కళ్లంలోనే కుప్పలు వేసి ఉంచాను. వర్షానికి తడిస్తే అంతా నష్టపోవాల్సిందే.

– వసంతల తిరుపతి, బంగారమ్మపేట సాలూరు



కూర్మరాజుపేటలో ఇంకా కోసిఉన్న వరిచేను

బడిదేవరకొండ మైనింగ్ పనులు ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ సభ్యుడు ఎం.కృష్ణమూర్తి

- పరిరక్షణ కమిటీ పిలుపు

పార్వతీపురంటౌన్: అక్రమంగా పనులు చేపడుతున్న బడిదేవరకొండ మైనింగ్ తవ్వకాలను వెంటనే ఆపాలని బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ సభ్యుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిదేవరకొండ తవ్వకాలు ప్రభుత్వ, ప్రజాప్రతినిధుల ప్రమేయంతోనే చేపడుతున్నారని, ఈ పనుల వల్ల కొండకు ఆనుకుని ఉన్న గిరిజనులు, ప్రజలు పార్వతీపురం మండలానికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ఈ అక్రమ మైనింగ్ ఆపాలని గత నెల నవంబర్ 6న బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభించినప్పుడు ఎమ్మెల్సీ కోడ్ కారణంగా అనుమతులు లేవని పోలీసులు అడ్డుకోవడంతో కార్యక్రమం నిలిపివేశామన్నారు. అనంతరం రైతులకు, ప్రజలకు ముమ్మరంగా కోతల సీజన్ ఉండడంతో కమిటీ నిర్ణయం మేరకు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఆనాడే ప్రకటన ద్వారా తెలియజేశామని చెప్పారు. నేడు కోతలు పూర్తి కావడంతో కార్యక్రమం పునఃప్రారంభం కోసం కమిటీ నిర్ణయంతో డిసెంబర్ 28న ఉదయం10 గంటలకు కోరి గ్రామంలో కొండ గ్రామాలతో పాటు చుట్టుపక్కల ఉన్న అన్ని గ్రామాల ప్రజలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ పాలక రంజిత్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.నర్సింగరావు, సీపీఐనాయకులు ఆర్‌వీఎస్ కుమార్, చెరువుల పరిరక్షణ కమిటీ నాయకుడు వి.దాలినాయుడు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకుడు బి.శ్రీనునాయుడు, ఎం.భాస్కరరావు, జనసేన నాయకుడు జయకృష్ణ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల మృతి పట్ల విచారణ జరపాలి

పార్వతీపురంటౌన్: గిరిజన విద్యార్థుల మృతి పట్ల విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలంలో మరో గిరిజన బాలుడు అనారోగ్యంతో మృతి చెందిన ఘటన తెలిసిందేనన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల మరణాలు జరుగుతున్నప్పటికీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి మొదటి సంతకం ఏఎన్ఎం పోస్టులపైన పెట్టినప్పటికీ ఇంతవరకు ఒక్క పోస్టు కూడా భర్తీ చేయకపోవడం మెరుగైన భోజనం, మెరుగైన వైద్యం అందక విద్యార్థులు మృతి చెందుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల మరణానికి ప్రభుత్వమే కారణమని, మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా చొప్పున తక్షణమే అందించాలని కోరారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంత్రి కార్యాలయం ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్

డీజీపీ డిస్క్ కమెండేషన్ అవార్డు అందజేసిన ఎస్పీ



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్: 2021, 2022 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక డీజీపీ డిస్క్ కమెండేషన్ అవార్డు (బ్రాంజ్ మెడల్), యాంత్రిక సురక్ష సేవా పతకాలను పొందిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి మెడల్స్, ప్రశంసా పత్రాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్, దిశ శాంతిభద్రతల విభాగంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, సిబ్బందికి ఏటా కమెండేషన్ అవార్డులు ఇస్తారని చెప్పారు. విధి నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి యాంత్రిక సురక్ష సేవా పతకాలకు అందజేయనున్నారన్నారు. ఈ క్రమంలో 2021, 2022 సంవత్సరం ప్రతిష్టాత్మక డీజీపీ డిస్క్ కమెండేషన్ అవార్డు(బ్రాంజ్ మెడల్) యాంత్రిక సురక్ష సేవా పతకాలను పొందిన పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందిస్తూ మున్ముందు ఇదే ప్రతిభ కనబరుస్తూ, అంకితభావంతో పనిచేస్తూ మరిన్ని అవార్డులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఎస్బీ సీఐ రంగనాథం, ఆర్ఐలు నాయుడు, శ్రీరాములు పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు.

చిన్నారులను పనిలో పెట్టరాదు..

పాలకొండ: బాలలతో పని చేయించడం నేరమని.. అందుకు శిక్ష తప్పదని కార్మిక శాఖాధికారి కిరణ్ తెలిపారు. ఆపరేషన్ స్వచ్ఛ స్టేజ్ –4లో భాగంగా పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేసి యజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆయనతో పాటు కానిస్టేబుల్ ఎం. క్రాంతి, సామాజిక కార్యకర్త తోట ప్రవీణ్, తదితరులున్నారు.

కల్వర్టుల నిర్మాణం వేగవంతం చేయాలి



జరుగుతున్న కల్వర్టు పనులు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను దశల వారీగా పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఇంజినీరింగ్ అధికారి అశోక్ అన్నారు. ఈ మేరకు బుధవారం లచ్చయ్యపేట పంచాయతీ నిధులు రూ 3.9 లక్షలతో ఎస్సీ కాలనీలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న కల్వర్టుల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ కాలనీలోని వీధుల్లో గడిచిన ఏడాదిలో కాలువలు, సీసీ రోడ్డు పనులు నిర్వహించినప్పటికీ కల్వర్టులు నిర్మించక పోవడం వల్ల రాకపోకలకు అవస్థలు పడడం, వృథానీరు కాలువల్లో నిలిచిపోవడంతో దోమలకు నిలయంగా మారిందన్నారు. దోమలు పెచ్చరిల్లడం వల్ల గ్రామస్తులు వ్యాధుల బారిన పడాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీకి విడుదలైన నిధులతో ఎస్సీ కాలనీ రోడ్లపై గ్రామస్తుల సూచనల మేరకు ప్రధాన రహదారిని ఆనుకున్న నాలుగు వీధులకు సంబంధించి నాలుగు కల్వర్టుల నిర్మాణం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, ఎన్ఆర్ఈజీఎస్ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

బలిజిపేట: సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనకు అందరం కలిసి పాటుపడాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు బలిజిపేటలోని ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులకు 9రకాల థీమ్స్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదరికం లేని, మెరుగైన జీవనోపాధులు, ఆరోగ్యకరమైన, బాలల స్నేహపూర్వక, పరిశుభ్ర, హరిత, స్వయం సమృద్ధిగా మౌలిక సదుపాయాలు కలిగిన, సామాజిక న్యాయం, భద్రత, సుపరిపాలన కలిగిన, మహిళల స్నేహపూర్వక గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు. రెండు రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో మంచిపరిపాలన సాగించి అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఈఓపీఆర్‌డీ కె.కృపారావు, మండలస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా



సమావేశానికి హాజరైన అధికారులు

సాలూరు రూరల్: సాలూరు మండల సర్వసభ్య సమావేశం గురువారానికి వాయిదా పడింది. బుధవారం జరగాల్సిన ఈ సమావేశానికి మండలంలోని 16 మంది ఎంపీటీసీలకు అధికార టీడీపీకి చెందిన ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే హాజరు కావడంతో సమావేశానికి కోరమ్ చాలక గురువారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ రమాదేవి ప్రకటించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 14 మంది ఎంపీటీసీలతో పాటు సర్పంచులకు ఎలాంటి ప్రాధాన్యం లేకుండా అధికారులు వ్యవహరిస్తున్నారన్న కారణంతో వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశానికి హాజరు కాలేదు. ఎన్ఆర్ఈజీఎస్ పనుల విషయంలో సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా కేవలం సంతకాలకే పరిమితం చేస్తున్నారన్న ఆరోపణలతో సమావేశాన్ని బాయికాట్ చేసినట్లు వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ తెలిపారు. ఇలాగే కొనసాగితే సర్వసభ్యసమావేశాలలో ప్రజల సమస్యలు చర్చించే పరిస్థితులు దూరమయ్యే పరిస్థితులు నెలకొంటాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బలిజిపేట: మండలంలోని కె.గలావిల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా సేవలందించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కె.దాలినాయుడిని పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. 2023, ఏప్రిల్ నెలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా జనార్దనవలసలో ఆయన విధుల్లో చేరారు. ఆ తరువాత కౌన్సెలింగ్‌లో కె.గలావల్లి ప్రాథమిక పాఠశాలలో చేరి 2024, నవంబరు 30వరకు సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.పోలినాయుడు, సహ ఉపాధ్యాయురాలు రాధ బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం 1998 క్వాలిఫైడ్ వారికి ఉద్యోగాలు ఇచ్చి ఒక మార్గం చూపించారన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా విధులలో చేరి మంచి సేవలు అందించిన దాలినాయుడు మాస్టారుకు భవిష్యత్‌లో మంచి జరగాలని కోరుకుంటున్నామంటూ ఉపాధ్యాయులు ఆయనను మనస్ఫూర్తిగా అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లు వదిలి క్యాంప్ వెళ్తే జాగ్రత్తలు తీసుకోవాలి



నిందితుల నుంచి విషయ సేకరణ చేస్తున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: మండలంలో అపరిచితులు తిరుగాడుతున్నందున గ్రామాంతరం వెళ్తున్న కుటుంబీకులు పోలీసువారికి ముందు జాగ్రత్తగా తెలియజేయాలని, తమ ఇళ్లలో ఉన్న సామగ్రి భద్ర పరుచుకోవాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. మండలకేంద్రంలోని గూడెంలో జె.కమలాకరప్రసాద్‌కు చెందిన కుటుంబీకులు దూర ప్రాంతాల్లో ఆరునెలలుగా నివాసం ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడం వల్ల ఇంటిబయట ఉన్న చిల్లర సామగ్రి చోరీకి గురైనట్లు వచ్చిన ఫిర్యాదుతో సంఘటనాస్థలాన్ని ఎస్సై రాజేష్ పరిశీలించారు.ఈ మేరకు ముగ్గురు మహిళలు ఇంటిబయట ఉన్న గమేలాలు, ఇనుముతో కూడిన జల్లెడలు, వంటలకు ఉపయోగించే పరికరాలను సంచుల్లో వేసి తరలిస్తుండగా స్థానికులు గుర్తించారని తెలియజేయగా ముగ్గురు మహిళలపై కేసులు నమోదు చేశామన్నారు. చోరీకి గురైన ఇంటి పరిసర ప్రాంతాన్ని పరిశీలించి గ్రామాల్లో ఇళ్లనుంచి నెలల తరబడి క్యాంప్‌లు వెళ్తున్నవారు ఇళ్లలో విలువైన సామగ్రి ఉంచడం మంచిది కాదని, ఇంటికి సంబంధించిన తాళాలు నాణ్యమైనవి వేయాలని, ఎవరైనా క్యాంప్‌లు వెళ్లే సమయంలో స్థానిక పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

క్లుప్తంగా

మంచి విద్యను అందించాలి



తుమరాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ-1సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని తుమరాడ ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పరీక్షించి వారి నైపుణ్యాలను గుర్తించారు. ప్రాథమికస్థాయి విద్యార్థులకు రాత, చదువు వచ్చేందుకు ప్రాముఖ్యం ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. మంచి దస్తూరి అలవాటు చేయాలని చెప్పారు. మధ్యాహ్నభోజన పథకాన్ని, పాఠశాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న పీడీ సులేఖ

బలిజిపేట: బలిజిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న బలిజిపేట మండలంలోని అంగన్వాడీ కేంద్రాలకు కొత్త పుస్తకాలను సీడీపీఓ సులేఖ బుధవారం పంపిణీ చేశారు. మండలంలో ఉన్న 94అంగన్వాడీ కేంద్రాలకు పీపీ-1, పీపీ-2 కొత్త పుస్తకాలు పంపిణీ చేశారు. ఒక్కో తరగతికి ఐదేసి పుస్తకాల వంతున పంపిణీ చేసినట్లు ఆమె ఈ సందర్భంగా తెలిపారు. మండలంలోని అంగన్వాడీ కేంద్రాలకు పీపీ-1, పీపీ-2కు సంబంధించి ఇంగ్లీషు, లెక్కలు, స్పోకెన్ ఇంగ్లీషు, ఏక్టివిటీ పుస్తకం, తెలుగు పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కొత్త పుస్తకాలతో పిల్లలకు పాఠ్యాంశాలు బోధించే విధంగా అంగన్వాడీ టీచర్లకు సూచించామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీసీ రేటు ఒప్పందం



హమాలీలతో సీఐటీయు నాయకులు, మిల్లు యాజమాన్యం

బలిజిపేట: బలిజిపేట రైస్‌మిల్లుల అసోసియేషన్, హమాలీస్ యూనియన్ మధ్య పీసీ రేటు ఒప్పందంపై ఇరువర్గాలు చర్చించుకుని ఒక అంగీకారానికి వచ్చినట్లు హమాలీయూనియన్ అధ్యక్షుడు పి.అప్పారావు తెలిపారు. రైస్‌మిల్లుల అసోసియేషన్, హమాలీలకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పీసీరేటు ఒప్పందం జరుగుతుందని ఆ ప్రకారం కొత్త ఒప్పందం జరిగిందని తెలిపారు. 12శాతం పీసీరేటు పెంచేందుకు అంగీకారం కుదిరినట్లు చెప్పారు. రైస్‌మిల్లు కార్మికులకు ప్రభుత్వం భద్రత చట్టం, పీఎఫ్ పెన్షన్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైస్ మిల్లుల అసోసియేషన్ సభ్యులు కె.రమేష్, సాయిరాం, రఘు, శేఖర్, సీఐటీయూ నాయకులు మన్మథరావు, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు అందించడంలో అలసత్వం వద్దు

- డిప్యూటీ డీఎంహెచ్ఓ పద్మావతి



బలిజిపేట పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ పద్మావతి

బలిజిపేట: వైద్యసేవలు అందించడంలో ఎవరూ అలసత్వం వహించవద్దని డిప్యూటీ డీఎంహెచ్ఓ కేపీఎస్ పద్మావతి వైద్యసిబ్బందికి సూచించారు. ఈ మేరకు బలిజిపేట పీహెచ్‌సీని, మిర్తివలసలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రికార్డులు, ఫార్మసీలో ఉండే మందులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ పరికరాలను పరిశీలించి రోగులకు అవసరమైన రక్తపరీక్షలు నిర్వహిస్తున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులతో మాట్లాడి వారి సమస్యలపై ఆరా తీశారు. వైరల్ జ్వరాలు ఎక్కడా సోకకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- తెగుళ్లపై అప్రమత్తం అవసరం

బలిజిపేట:

తక్కువ పెట్టుబడితో మొక్కజొన్న సాగుద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. మొక్కజొన్న సాగులో యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, కత్తెర పురుగు వంటి తెగుళ్ల నివారణపై రైతులు దృష్టిసారించాల్సి ఉంటుందన్నారు. రైతులకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న పంట మంచి లాభదాయకంగా కనిపిస్తుస్తోంది. నీటివనరులు తక్కువ ఉన్నా, తక్కువ పెట్టుబడితో, తక్కువ కాలంలో మొక్కజొన్న పంట చేతికి తీసుకోవచ్చు. నవంబరు, డిసెంబర్ నెలల్లో మొక్కజొన్న పంటసాగు చేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

నాణ్యమైన విత్తనాలను ఎన్నుకోవాలి

మొక్కజొన్న సాగులో మంచి రకాల విత్తనాలను రైతులు ఎంచుకోవాలి. వాటిలో డీహెచ్‌ఎం-111, బీహెచ్‌ఎం-1576, డీహెచ్‌ఎం-113, బీహెచ్-1620రకాలు అనువైనవి, వాటితోపాటు సంగీత, బేయర్, ఎడ్‌వంటా, భారత్, సీపీఎస్ ఇండియా కంపెనీలకు చెందిన విత్తనాలు మంచివి. హైబ్రిడ్‌లో అడ్వాంట-741, 751, డెకాల్బ్-9144, 9178 ఈ రకాల విత్తనం అధిక దిగుబడిని ఇచ్చే మధ్యకాలిక రకం. ఎండు ఆకు, కాండం కుళ్లు, కంకి ఎండు తెగులు తట్టుకునే శక్తి ఉండడంతో వీటికి ప్రాధాన్యం లభించింది. కోత సమయంలో కర్ర పచ్చిగా ఉండి మేలైన పశుగ్రాసంగా పనికివస్తుంది. ఇవి స్వల్పకాలిక హైబ్రిడ్ రకాలు. ఈ పంటసాగుకు నీరు ఇంకే నల్లరేగడి, ఎర్రనేలలు, ఎంతో అనుకూలం. నీరు ఇంకే నేలలు ఈ పంట సాగుకు పనికిరావు. రైతులు విత్తే సమయంలో తప్పకుండా విత్తనశుద్ధి చేసుకోవాలి. కిలో విత్తనానికి 3గ్రాములు మాంకోజెట్ ఎం-45 లేదా కాప్టాన్ మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలి.



రైతు పండిస్తున్న మొక్కజొన్న

కలుపుయాజమాన్య పద్ధతులు

పంట విత్తిన తరువాత 2,3రోజుల్లోపు అట్రజిన్ అనే కలుపుమందును ఎకరాకు 800గ్రాములు 200లీటర్ల నీటికి కలిపి తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల నెలపాటు కొన్ని గడ్డిజాతి మొక్కలను అదుపుచేయవచ్చు. విత్తిన 30-35రోజులకు పశువులతో (దంతి, గొర్రు) ట్రాక్టర్‌తో అంతర కృషి చేస్తే కలుపు నివారించుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం:

మొక్కజొన్న సాగు 30-35రోజుల మధ్య ఎకరాకు 30కేజీల నత్రజని, 50కేజీల పొటాష్ వేసుకోవాలి. ఎకరాకు 20కేజీల జింక్‌సల్ఫేటు వేసుకోవాలి. మొక్కల ఆకులు పసుపు పచ్చ రంగులోకి మారుతున్నట్లు కనిపిస్తే లీటరు నీటికి 2గ్రాములు జింక్ సల్ఫేటు పిచికారీ చేయాలి. పొలాల్లో పైపాటి ఎరువులు వేసేటప్పుడు భూమిలో తగినంతగా తేమ ఉండాలి. మామూలుగా మొక్కొజొన్న పంటకు పిచికారీ మందులు ఎక్కువగా ఉండవు. ఎరువులు కూడా తక్కువే వేసుకోవాలి.

సస్యరక్షణ చర్యలు ఇలా:

మొక్కజొన్న పంట రబీలో సాగుచేసే సమయంలో గులాబీ రంగు కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. పిల్ల పురుగులు మొదట ఆకుల పత్రహరితాన్ని గోకి తింటాయి. తర్వాత ముడుచుకుని ఉన్న ఆకు ద్వారా కాండంలోకి చేరుతాయి. లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వల్ల మువ్వ చనిపోయి ఎండిపోతుంది. వీటి నివారణకు రైతులు చర్యలు చేపట్టాలి. పొలంలో కలుపు మొక్కలు, చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేసుకోవాలి. పురుగు ఆశించిన మొక్కలు పీకి దూరంగా తీసుకెళ్లి నాశనం చేయాలి. పొలం చుట్టూ 3-4వరుసల జొన్నను ఎర పంటగా వేసి 40రోజుల తరువాత తీసి వేయాలి. మొక్కజొన్నలో అంతర పంటగా కంది, సోయాబీన్, సాగు చేయడం వల్ల పురుగు ఉధృతి తగ్గిపోతుంది. మోనోక్రోటోఫాస్-36 ఎకరాకు 320మిల్లీలీటర్లు లేదా క్లోరాంట్రినిలిప్రోల్(కొరాజిన్, రైనాక్సిపర్) లాంటివి ఎకరాకు 60మిల్లీలీటర్లు 200లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువ ఉంటే కార్బొఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరాకు 3కిలోలు చొప్పున పైరు మొలక ఎత్తిన 25-30రోజులకు ఆకుల సుడులలో వేసుకోవాలి. దీనివల్ల పురుగుల ఉధృతిని నివారించుకోవచ్చు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు

మొక్కజొన్న పంటను ముఖ్యంగా కత్తెర పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. దాని నివారణకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి ఎక్కువగా వస్తుంది. ఎటువంటి తెగుళ్లు, చీడపీడలు సోకినా వ్యవసాయశాఖ సూచనలు పాటిస్తే రైతుకు మేలు జరుగుతుంది.

ఎం.శ్రావణ్‌కుమార్‌నాయుడు, ఏఓ, బలిజిపేట